సాక్షి
బాపట్ల
మంగళవారం । 2 । జూలై । 2024



వైభవంగా ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: వేమవరంలోని కాశీ విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ ఆరో వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు.



కనుల పండువగా శ్రీవారి కల్యాణం

నరసరావుపేటఈస్ట్: శ్రీనివాసనగర్‌లోని గోదా పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం చేశారు.



మేతగా మారిన మొక్కలు

సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు–మాచర్ల ప్రధాన రహదారిలో సెంట్రల్ డివైడర్‌పై ఏర్పాటు చేసిన మొక్కలు మేకలకు మేతగా మారాయి. అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి మరి.

న్యూస్‌రీల్

ఈ ఏడాది రుణ ప్రణాళిక రూ.18,369 కోట్లు



నరసరావుపేట: కలెక్టరేట్‌లో సోమవారం 2024–25 సంవత్సరానికి రూ.18,369 కోట్లతో రూపొందించిన వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్ ఆవిష్కరించారు. వార్షిక ప్రణాళికలో ప్రాధాన్యత రంగాలకు రూ.15,998 కోట్లు కేటాయించగా, వ్యవసాయ రంగానికి రూ.13,211 కోట్లు, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు రూ.2,224కోట్లు కేటాయించారు. ఇతర రంగాలకు రూ.563 కోట్లు కేటాయించారు. గతేడాది వార్షిక రుణ ప్రణాళికను విజయవంతంగా అధిగమించినందుకు ఎల్‌డీఎం కేవీఎస్ రామప్రసాదు బ్యాంకర్లను అభినందించారు. ప్రస్తుత ఏడాది కూడా రుణ లక్ష్యాలను అధిగమించాలని కోరారు. జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాదు, అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో కలెక్టర్ తనిఖీలు



నరసరావుపేట: బురదమయంగా మారిన ఆర్టీసీ బస్టాండ్‌ను జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి లత్కర్ సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మున్సిపల్, ఆర్టీసీ అధికారులతో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండ్‌లో నీరు నిలబడేందుకు గల కారణాలను ఆర్టీసీ ప్రజా రవాణా జిల్లా అధికారి ఎస్.వి శ్రీనివాసరావు కలెక్టర్‌కు వివరించారు. బస్టాండ్‌లో నిల్చున్న మురుగుని తక్షణమే తొలగించి ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డిని ఆదేశించారు.

ఐటీఐలో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం


మాచర్ల: పల్నాడు జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి రెండో విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, మాచర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ ప్రసాద్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి పాసై ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో ఐటీఐ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు జులై 25వ తేదీ మాచర్ల పట్టణంలోని ఐటీఐ కళాశాలలో సంప్రదిస్తే ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తామని తెలిపారు. జులై 27, 28 తేదీల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుందన్నారు. ఇతర వివరాలకు మాచర్ల పట్టణంలోని ఐటీఐ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వైభవంగా చౌడేశ్వరి ఆలయ వార్షికోత్సవం



రెంటచింతల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో వేంచేసిన చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం 16వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఓరుగంటి మారుతీశర్మ నేతృత్వంలో చౌడేశ్వరి అమ్మవారికి వేకువజామున ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు పంచామృతాలతో అభిషేకం, 9 గంటలకు హోమం జరిపించారు. 10 గంటల నుంచి పెద్దసంఖ్యలో మహిళా భక్తులు అమ్మవారికి బోనాలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి వేడుకలలో పాల్గొన్న వందలాది మంది భక్తులకు అన్నదానం చేపట్టారు. దేవస్థానం కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 504.10 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 815.00 అడుగుల వద్ద ఉంది.

ఒక్క క్లిక్‌తో ఎయిమ్స్

- 'ఈ- పరామర్శ' యాప్‌తో సులభంగా వైద్య సేవలు
- గ్రామీణ ప్రాంత రోగులకు అవగాహన కరువు
- యాప్ వైద్య సేవలపై మరింత ప్రచారం కల్పించాలంటున్న ప్రజలు



ఎయిమ్స్ ఆస్పత్రి

మంగళగిరి: రాష్ట్రానికే తలమానికంగా, దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద ఆసుపత్రిగా మంగళగిరిలోని ఆల్ ఇండియా మెడికల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(ఎయిమ్స్) విలసిల్లుతోంది. నిపుణులైన వైద్యులు, అధునాతన పరికరాలతో పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి వచ్చాయి. తక్కువ ఖర్చుతో నాణ్యమైన సేవలు అందడంతో రోగులు బారులు తీరుతున్నారు. రాష్ట్రంతో పాటు తెలంగాణ, చెన్నై, ఒడిస్సా రాష్ట్రాల నుంచి రోజుకు మూడు వేల మందికిపైగా రోగులు వస్తున్నారు.

రోగులకు తప్పని కష్టాలు

రోగులకు సులభతరంగా వైద్య సేవలందించేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యలు ఫలితాన్ని ఇవ్వడం లేదు. ఆస్పత్రిలో వసతుల గురించి రోగులకు అవగాహన కల్పించడంలో విఫలం చెందుతున్నారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు కష్టాలు తప్పడం లేదు. సమస్యను గుర్తించిన ఎయిమ్స్ అధికారులు 'ఈ- పరామర్శ' యాప్ ద్వారా టెలీ మెడిసిన్ అందుబాటులోకి తెచ్చారు. నేరుగా వైద్యసేవలు అందని వారికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఒకసారి వైద్యం చేయించుకున్న వారు తర్వాత యాప్ ద్వారా వైద్య సేవలందుకునే అవకాశం ఉంది. అయితే, దీనిపై రోగులకు పెద్దగా అవగాహన లేక ఉపయోగించడం లేదు.

టెలీ కన్సల్టెన్సీ రిక్వెస్ట్ కోసం ..

టెలీ కన్సల్టెన్సీ మీద నొక్కితే రోగి వివరాలు కనిపిస్తాయి. జనరల్ మెడిసిన్, దంత, నేత్ర, ఎముకలు ఇలా.. 12 రకాల వైద్యసేవలు అందుబాటులో ఉంటాయి. రోగి ఏ విభాగం సేవలు కోరుకుంటే ఆ విభాగం జ్వరం, దగ్గు, ఇతర లక్షణాలు నమోదు చేయాల్సిందిగా అడుగుతుంది. ఆరోగ్య సమస్య ఏమిటని ఒక టేబుల్ వస్తుంది. దానిలో రోగి ఆరోగ్య సమస్య నమోదు చేయాలి. సంబంధిత వైద్య విభాగంలో స్లాట్ బుకింగ్‌లోకి వెళ్తాం. రోగికి కావాల్సిన తేదీని నమోదు చేయాలి. వారంలో సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజు ఉదయం 8.30 నిముషాల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య (శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 5 గంటల వరకు) వైద్యులు అందుబాటులోకి వచ్చి సలహాలు ఇస్తారు.

నేరుగా వచ్చే వారికీ ఉపయోగకరం

నేరుగా ఓపీకి వెళ్లి రూ 10 చెల్లించి సంబంధిత వైద్యుడితో పరీక్ష చేయించుకోవచ్చు. రక్త, ఇతర పరీక్షలు, స్కానింగ్, ఎక్సరే చేయించుకున్నాక సంబంధిత రిపోర్టులు యాప్‌లో నమోదు చేసుకోవచ్చు. యాప్ ద్వారా వైద్యులకు ఆరోగ్య సమస్యలపై వివరించవచ్చు. వారు ఇచ్చే సలహాలను బట్టి వైద్యసేవల్ని పొందవచ్చు. నేరుగా ఎయిమ్స్‌కు వచ్చే రోగులు ఓపీ ఎంక్వయిరీతో పాటు యాప్‌లో ఏ వైద్యుడు ఎక్కడ సేవలందిస్తారనే వివరాలు, గది నంబర్ తెలుసుకోవచ్చు. ఓపీలో రూ. 10 చెల్లించాక వైద్యుడు రాసే పరీక్షల చార్జీలను వెంటనే తెలుసుకోవచ్చు. చేయించుకున్న పరీక్షల రిపోర్టులు మన మొబైల్ యాప్‌కు వస్తాయి. ఇదే యాప్‌లో కుటుంబసభ్యులకు సంబంధించి మరో వ్యక్తి పేరు యాడ్ చేసుకోవచ్చు. దీన్ని నొక్కితే ఈ మొబైల్‌లో యాడ్ అయిన కుటుంబ సభ్యులకు సంబంధించిన వైద్య వివరాలు తెలుస్తాయి.

విస్తృత అవగాహన అవసరం

అసలు చాలామందికి 'ఈ-పరామర్శ' యాప్ సౌకర్యం ఉన్నట్లు తెలియదు. 'ఎయిమ్స్ వైద్య సేవలు కోరుకుంటున్నారా ? అయితే ఆ యాప్ ఎంతో ఉపయోగపడుతుంద'ని ఎయిమ్స్ అధికారులు సలహా ఇస్తున్నా ప్రయోజనం ఉండటం లేదు. గ్రామ ప్రాంతాల నుంచి అధికంగా వస్తున్న రోగులు నిరక్షరాస్యులు కావడంతో యాప్‌పై అవగాహన లేక ఇబ్బంది పడుతున్నారు. అధికారులు మరింత అవగాహన కల్పించి, విస్తృతంగా ప్రచారం కల్పించాలని రోగులు కోరుతున్నారు.

యాప్ డౌన్‌లోడ్ చేసుకునే పద్ధతి

గుగూల్ ప్లే స్టోర్‌లో ఎయిమ్స్ మంగళగిరి అని సెర్చ్ చేసి 'ఈ–పరామర్శ' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. గెట్ స్టార్టెడ్ క్లిక్ చేయాలి.లాగిన్ పేషంట్ లేదా డాక్టర్ అని ఆప్షన్స్ వస్తాయి. రోగి తన ఫోన్ నంబర్ నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. లాగిన్ అయ్యాక రోగి తండ్రి పేరు వయస్సు, పురుషుడు లేదా స్త్రీ చిరునామా మెయిల్ ఐడీ ఇవ్వాలి. రిజిస్టర్ బటన్ నొక్కితే యాప్‌లో లాగిన్ అవుతారు.



ఒడిపోయినా... ప్రజల మనస్సులో ఉండిపోయాం

- రెట్టించిన ఉత్సాహంతో ముందుకువెళ్తాం
- ప్రజలకు అండగా ఉండటమే ప్రథమ కర్తవ్యం
- మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ఓడిపోవచ్చు కానీ... ప్రజల మనస్సులో ఉండిపోయామని మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల గుండెల్లో వైఎస్సార్ సీపీ స్థానం పదిలంగానే ఉందని చెప్పారు. 40 శాతం ఓట్ బ్యాంకుగా ఉన్న మనకు ప్రజల సమస్యలపై అనునిత్యం అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత మరింత పెరిగిందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండాగా ఉంటామని చెప్పారు. అధైర్యపడకుండా అందరం ఐక్యంగా ముందుకుపోదామని సూచించారు.



మాట్లాడుతున్న కోన రఘుపతి

8న మహానేత డాక్టర్ వైఎస్సార్ జయంతి వేడుకలు

బాపట్ల నియోజకవర్గంలో మహానేత డాక్టరు వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను ఈనెల 8వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని రఘుపతి తెలిపారు. ప్రజలు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, కాగిత సుధీర్‌బాబు, మార్కెట్ యార్డు చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, ఎంపీపీలు చిన్నపోతుల హరిబాబు, షేక్ బాజీ, నాయకులు ఉయ్యూరు లీలాశ్రీనివాసరెడ్డి, షేక్ సయ్యద్‌పీర్, ఇగనలూరి మాల్యాద్రి, జోగి రాజా పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 45 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవించారు. బాధితుల సమస్యలను తెలుసుకున్న ఎస్పీ చట్టపరిధిలో విచారించి బాధితులకు త్వరితగతిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎస్పీ జిల్లాలోని పోలీస్ అధికారులతో మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం పోలీస్‌స్టేషన్లకు వచ్చే బాధితుల సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేయాలని చెప్పారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ సిహెచ్.మురళీకృష్ణ, సీఐ సిహెచ్.సింగయ్య పాల్గొన్నారు.



బాధితుల కష్టాలను తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



నూతన ప్రభుత్వం పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రేపల్లె మండలం పేటేరులో లబ్ధిదారుడికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పింఛన్ అందజేశారు. - రేపల్లె రూరల్





అమరవీరుడికి నివాళి

లద్దాఖ్ వద్ద నది దాటే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన బాపట్ల జిల్లా రేపల్లె మండలం కైతేపల్లి పంచాయతీ ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన సుభాన్‌ఖాన్(42) భౌతికకాయం సోమవారం స్వగ్రామానికి చేరింది. భౌతిక కాయాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, సైనిక అధికారులు, పోలీసులు సందర్శించి నివాళులర్పించారు. సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. - రేపల్లె రూరల్

కారులో భారీగా వెండి తరలింపు

- పోలీసుల తనిఖీల్లో పట్టివేత
- రూ.23 లక్షల విలువైన వెండి వస్తువులు
- బిల్లులు లేనందున రూ.1.38 లక్షల అపరాధ రుసుం విధింపు

చిలకలూరిపేటటౌన్: ఎలాంటి బిల్లులు లేకుండా కారులో తరలిస్తున్న 36 కిలోల వెండిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటికి సరైన బిల్లులు లేనందున జిల్లా వాణిజ్య పన్నులశాఖకు అప్పగించారు. చిలకలూరిపేటలో జరిగిన ఈ ఘటనపై సోమవారం అర్బన్ పోలీసులు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అర్బన్ సీఐ పి.రమేష్ అందించిన వివరాలు.. సోమవారం పట్టణంలోని నరసరావుపేట సెంటర్లో వాహనాల సాధారణ తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో విజయవాడ నుంచి మార్కాపురం వెళ్తున్న ఓ కారులో అనుమానాస్పదంగా మూడు బ్యాగులు కనిపించాయి. వాటిని సోదా చేయగా రూ.23,04,000 విలువైన ఆరు కిలోల వెండి వస్తువులు ఉన్నాయి. వీటికి సరైన బిల్లులు లేకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆయా వస్తువుల్ని వ్యాపార నిమిత్తం మార్కాపురం నెహ్రూనగర్‌లో స్థిరపడిన రాజస్థాన్ వాసులు అర్జున్‌సింగ్, సూర్‌సింగ్, విక్రమ్‌సింగ్ వీటిని తరలిస్తున్నట్లు గుర్తించారు. సరైన బిల్లులు లేని కారణంగా వెంటనే జిల్లా వాణిజ్య పన్నుశాఖ అధికారులకు సమాచారం అందించి, తనిఖీల్లో పట్టుబడిన వెండిని అప్పగించారు. ఎలాంటి బిల్లులు లేకుండా భారీగా వెండిని తరలిస్తున్న వారిపై రూ.1,38,240 అపరాధ రుసుం చెల్లించి తమ వస్తువుల్ని తీసుకెళ్లాలని వాణిజ్య పన్నుల శాఖ అధికారి మల్లికార్జున్ ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ పి.రమేష్, ఎస్‌ఐ ఎస్.సుమన్ ఉన్నారు.

ఎన్నికల వ్యయ దస్త్రాలన్నీ వెంటనే నివేదించాలి

ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీధర్

బాపట్ల: ఎన్నికల వ్యయానికి సంబంధించిన దస్త్రాలన్నీ ఈనెల 4వ తేదీ లోగా విధిగా ఎన్నికల కమిషన్‌కు నివేదించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సిహెచ్.శ్రీధర్ కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోటీ చేసిన అభ్యర్థులంతా ఎన్నికల నిబంధనలు పాటించాల్సి ఉందని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తదుపరి ఎన్నికలలో పోటీ చేసే అవకాశాలు కోల్పోతారని పేర్కొన్నారు. పార్లమెంటు, శాసనసభ స్థానాలలో పోటీచేసిన అభ్యర్థులు ఎన్నికలకు వెచ్చించిన వ్యయానికి అకౌంట్స్ స్పష్టంగా చూపాలని కోరారు. దస్త్రాల నమోదులో తప్పులు, పొరపాట్లు చేసి ఉంటే వాటిని తక్షణమే సరిదిద్దుకోవాలని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలలో ప్రధాన పార్టీలు వెచ్చిస్తున్న అధిక వ్యయాన్ని నియంత్రించేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని పోటీ చేసిన పలువురు అభ్యర్థులు డిమాండ్ చేశారు. భారీ ర్యాలీలు, సభలు, సమావేశాలు, ఓటర్లను ప్రలోభ పెట్టేలా భోజనాలు వంటి తదితర ఖర్చులను సరిగా నమోదు చేసే వ్యవస్థను రూపొందించాలని కోరారు. పోటీ చేసే ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలను రాజ్యాంగం కల్పించిందని చెప్పారు. అమలులో లోపాలను సవరించాలని పలువురు సూచనలు చేశారు. సమావేశంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు పవార్ స్వప్నిల్, కనహయ్య పొద్దార్, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్. సత్తిబాబు, నోడల్ ఆఫీసర్ హరికృష్ణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీధర్

కొత్త క్రిమినల్ చట్టాలను నిలిపివేయాలి

చీరాలలో న్యాయవాదులు విధుల బహిష్కరణ

చీరాల రూరల్: ప్రజా వ్యతిరేక క్రిమినల్ చట్టాలను తక్షణమే కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రంలోని ప్రస్తుత పాలక ప్రభుత్వం నిలిపివేయాలని కోరుతూ సోమవారం చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్ బాబు, న్యాయవాదుల సంఘం రాష్ట్ర నాయకుడు బూదరాజు శశికిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలను దుయ్యబట్టారు.

కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా, నిరంకుశంగా వ్యవహరించి మూడు క్రిమినల్ కొత్త చట్టాలను తీసుకువచ్చిందన్నారు. కొత్త చట్టాలన్నీ పోలీసులకు అనుకూలంగా ఉన్నాయని ఆరోపించారు. రాజకీయ నాయకుల చేతిలో కీలుబొమ్మలుగా ఉండే పోలీసుల చేతికి ఈ చట్టాలు చేరితే అరాచకం రాజ్యమేలుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాత చట్టాల స్థానంలో తెచ్చిన కొత్త చట్టాల రూపకల్పనలో న్యాయ పండితులు, న్యాయ కోవిదులు, మేధావి వర్గం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వంటివారి సలహాలను తీసుకోకుండా ఇష్టానుసారంగా కొత్త చట్టాలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇదే విధంగా కేంద్ర ప్రభుత్వం ఒంటెద్దుపోకడలు పోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని న్యాయవాదులు హెచ్చరించారు. కొత్త చట్టాలను తాత్కాలికంగా నిలిపివేసి పాత చట్టాలను యథాతథంగా అమలు చేయాలని వారు కేంద్రానికి సూచించారు. నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

పరిసరాల పరిశుభ్రతతో అంటువ్యాధులు దూరం

రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లెరూరల్: పరిసరాల పరిశుభ్రతతో అంటువ్యాధులను దూరం చేయవచ్చని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. స్టాఫ్ డయేరియా కార్యక్రమాన్ని సోమవారం రేపల్లె పట్టణంలో ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని వివరించారు. డయేరియా లక్షణాలు, అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స తీసుకోవాలని ప్రజలకు సూచించారు. వారంరోజుల పాటు స్టాఫ్ డయేరియా ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆరోగ్య సిబ్బందిని కోరారు. ఆరోగ్య కేంద్రాలలో విధిగా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచటంతో పాటు డయేరియాకు పూర్తిస్థాయిలో చికిత్సలు అందించాలని చెప్పారు. ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పంతాని మురళీధరరావు, దేవగిరి రవిశంకర్ పాల్గొన్నారు.



జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

నివాస గృహాలు తొలగింపు సరికాదు

డీఆర్‌ఓకు పేదల వినతి

'వాడరేవు– పిడుగురాళ్ల హైవే నిర్మాణంలో భాగంగా చీపురుపాలెం సిండికేట్ కాలనీ రోడ్ మార్జిన్‌లో నివాసం ఉంటున్న గృహాలను తొలగించాలని కాంట్రాక్టర్లు బెదిరిస్తున్నారని డీఆర్‌ఓ సత్తిబాబుకు పేదలు విన్నవించారు. పేద ప్రజల ఇళ్ల జోలికి రాకుండా రోడ్ల నిర్మాణాలు చేయాలని అర్జీలో విన్నవించారు'.

బాపట్ల: స్థానిక కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్. సత్తిబాబు అర్జీలు స్వీకరించారు. ఆన్‌లైన్‌లో వచ్చిన అర్జీలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. నమోదైన అర్జీలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి సత్తిబాబు

జనరిక్ మందులు షాపు ఏర్పాటు చేయాలి

జిల్లా కేంద్రమైన బాపట్ల పట్టణంలో జనరిక్ మందులు షాపులు ఏర్పాటు చేయాలని ప్రజా నాయకులు కాగిత కోటేశ్వరరావు, రాజారావు కోరారు. ప్రజల ఆరోగ్యంపై ఆశాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకునే విధంగా చూడాలని అర్జీలో పేర్కొన్నారు.

– కాగిత కోటేశ్వరరావు

క్లుప్తంగా

జాతీయ అథ్లెటిక్ పోటీల్లో రేష్మికి కాంస్య పతకం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఇటీవల ఛండీగఢ్‌లోని పంచకులలో జరిగిన 63వ జాతీయ అంతర్ రాష్ట్రాల అథ్లెటిక్ పోటీల్లో జావెలిన్ త్రో విభాగంలో గుంటూరుకు చెందిన రేష్మి కాంస్య పతకం సాధించిందని అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జి.వి.ఎస్. ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈవెంట్‌లో 52.39 మీటర్ల దూరం విసిరి తృతీయ స్థానం పొందిందని పేర్కొన్నారు. ఇప్పటికే రేష్మి ఖాతాల్లో అనేక జాతీయ పతకాలు చేరాయన్నారు. ఈ సందర్భంగా రేష్మికి ఏఐసీసీ కార్యదర్శి జి.ఉషా నాయుడు, స్పోర్ట్స్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ ఎం.శివకుమార్, టి.అరుణ్‌కుమార్ అభినందనలు తెలిపినట్లు తెలియజేశారు.

పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో పలు రైళ్లను గుంటూరు–విజయవాడ మీదుగా తాత్కాలికంగా రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ సోమవారం వెల్లడించారు. రైలు నంబర్ 17329 (హుబ్లీ–విజయవాడ) ఈనెల 15నుంచి 31వరకు, 17330 (విజయవాడ–హుబ్లీ) ఈనెల 16 నుంచి ఆగస్టు 1వరకు, 17282 (నరసాపూర్–గుంటూరు), 17281 (గుంటూరు–నరసాపూర్) ఈనెల 1నుంచి 31వరకు రద్దు చేసినట్లు వివరించారు.

టేకు చెట్ల నరికివేత నిందితులు అరెస్ట్

ముప్పాళ్ల: వ్యవసాయ భూమిలో టేకుచెట్లను నరికి అమ్మకం జరిపిన నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు సత్తెనపల్లి రూరల్ సీఐ ఎమ్.రాంబాబు సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన సీహెచ్ వెంకటనాగకోటేశ్వరరావుకు చెందిన వ్యవసాయ భూమిలోని పది టేకు చెట్లను నరికి ట్రాక్టర్‌ల ద్వారా తరలించిన సంగతి తెలిసిందే. రైతు ఫిర్యాదు మేర కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. విచారణలో మొత్తం తొమ్మిది మంది ఈ వ్యవహారంలో పాల్గొన్నట్లు నిర్ధారించుకొని వారిపై కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి నరికిన దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించి నలుగురిని అదుపులోకి తీసుకొని సత్తెనపల్లిలోని కోర్టుకు హాజరుపరిచినట్లు రూరల్ సీఐ ఎం.రాంబాబు తెలిపారు.

ఏవీ సుబ్బారావు రంగస్థల పురస్కారం ప్రదానం

- చింతలపూడి చెంచయ్యకు ప్రదానం
- ప్రముఖ సాహితీవేత్త మన్నె శ్రీనివాసరావు అభినందన



చింతలపూడి చెంచయ్యకు ఏవీ సుబ్బారావు అవార్డు ప్రదానం చేస్తున్న దృశ్యం

తెనాలి: ప్రఖ్యాత రంగస్థల నటుడు ఆంధ్ర గానకోకిల ఏవీ సుబ్బారావు తన పద్యగానంతో దశాబ్దాలపాటు నాటక అభిమానులను అలరించారని ప్రముఖ సాహితీవేత్త మన్నె శ్రీనివాసరావు కొనియాడారు. ఆయన కళావారసత్వాన్ని తర్వాతి రెండు తరాలు కొనసాగించటం, ప్రేక్షకుల ఆదరణ పొందటం అదృష్టమన్నారు. ఏవీ సుబ్బారావు 94వ జయంతి వేడుకలు, ఏవీ సుబ్బారావు 13వ రంగస్థల పురస్కార ప్రదానోత్సవాన్ని సోమవారం సాయంత్రం తెనాలిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటైన సభకు మన్నె శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సభలో ప్రముఖ రంగస్థల సంగీత దర్శకుడు, నంది అవార్డు గ్రహీత చింతలపూడి చెంచయ్యకు ఏవీ సుబ్బారావు రంగస్థల పురస్కారం ప్రదానం చేశారు. శాలు, గజమాలతో సత్కరించి అవార్డును, జ్ఞాపికను బహూకరించారు. గత నాలుగు దశాబ్దాలుగా ఏవీ సుబ్బారావు, ఆయన తనయులు, మనవడికి సంగీత సహకారాన్ని అందిస్తున్న ప్రముఖ రంగస్థల సంగీత దర్శకుడు చింతలపూడి చెంచయ్యకు అవార్డు ప్రదానం సముచితమని వక్తలు ప్రశంసించారు. ఏవీ సుబ్బారావు రంగస్థల సమాఖ్యకు చెందిన శ్రీపూర్ణశ్రీ నాట్య కళాసమితి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో రాష్ట్రానికి చెందిన ప్రసిద్ధ కళాకారులు ఆచంట బాలాజీనాయుడు, గుమ్మడి జీవన్ కుమార్, కె.వనజకుమారి, సాకె మల్లికార్జునరావు, రత్నశ్రీ, డీఎస్పీ రావు, ఎ.రామదాసు, ఎస్‌కే బా, మోడి ఆంజనేయులు, బీపీ మోహనరావు, చింతలపూడి చంద్రశేఖరరావు, పాతూరి సుబ్రహ్మణ్యం, ధర్మరాజు, బి.శివశంకర్ పాల్గొన్నారు. ఏవీ సుబ్బారావు జయంతి ఉత్సవంలో భాగంగా మధ్యాహ్నం 2 గంటల్నుంచి పలు పౌరాణిక పద్యనాటకాల్లోని సన్నివేశాలను ప్రదర్శించారు. పాండవోద్యోగం(కర్ణసందేశం), శ్రీరామాంజనేయ యుద్ధం(యుద్ధ సీను), చింతామణి(ప్రేమ సన్నివేశం), గయోపాఖ్యానం (యుద్ధసీను) ప్రదర్శించారు. వల్లూరు శ్రీహరిరావు– టీవీఎస్ శర్మ, ఆరాధ్యుల నాగరాజు–జి.హైడిరాజు, ఆరాధ్యుల ఆదినారాయణ–రత్నశ్రీ, ధూపం తిరుమలతేజ–ధూపం రామకృష్ణ నటించారు. ఆరాధ్యుల వెంకటేశ్వరరావు, ఆదినారాయణ, నాగరాజు పర్యవేక్షించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

డీఎంహెచ్‌ఓ
డాక్టర్ కొర్రా విజయలక్ష్మి



ర్యాలీ ప్రారంభోత్సవంలో డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, హాజరైన ఆరోగ్య సిబ్బంది

గుంటూరు మెడికల్: ప్రస్తుత వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా ఆమె సోమవారం నగరంలో అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జులై అంతా డెంగీ వ్యతిరేక మాసంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. డెంగీ నివారణే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని సూచించారు. పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. డెంగీని వ్యాపింపజేసే ఏడీస్ ఈజిప్టి దోమ మంచి నీటిలో గుడ్లు పెడుతుందన్నారు. దీన్ని టైగర్ మస్కిటో కూడా అంటారని, ఇది తెల్లవారుజాముననే కుడుతుందని చెప్పారు. ఇళ్ల లోని నీటి తొట్టెలు, కొబ్బరి చిప్పలు,తాగి పడేసిన టీ కప్పులు, రోళ్లు, పాత టైర్లు, ఓవర్ హెడ్ ట్యాంకులు, పూల కుండీలు, వాటర్ కూలర్లలో నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని తెలిపారు. సాయంత్రం వేప పొగ వేయడం, శరీరాన్ని పూర్తిగా కప్పిఉంచే దుస్తులు ధరించడం ఉత్తమమని సూచించారు. ఇళ్లకు మెష్ డోర్లు, దోమతెరలు వాడటం వల్ల దోమకాటు నుంచి తప్పించుకోవచ్చని వివరించారు. వర్షాకాలంలో తగిన జాగ్రత్తలు పాటించడం వల్ల దోమల వల్ల వచ్చే వ్యాధుల్ని అరికట్టవచ్చని పేర్కొన్నారు. ర్యాలీలో పాల్గొన్న ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది దోమల నివారణ చర్యలపై నినాదాలు చేశారు. ర్యాలీ నగరంపాలెంలోని మూడు బొమ్మల సెంటర్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, డాక్టర్ కె.వి.సుబ్బరాజు, డాక్టర్ బి. లక్ష్మనాయక్, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, రాజు నాయక్, సబ్ యూనిట్ ఆఫీసర్లు ఘంటసాల శ్రీనివాసరావు, నరేంద్ర, ప్రశాంత్, సాంబయ్య, సుకుమార్, వెంకటప్పయ్య, మల్లికార్జున్ రావు, వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఏతెర్ రిస్తా స్కూటర్ విడుదల



నగరంపాలెం: ఎలక్ట్రిక్ స్కూటర్ ఏతెర్ రిస్తా ఫ్యామిలీ వాహనం అని, అందరికీ అందుబాటు ధరలో ఉందని షోరూం ఎండీ చుక్కపల్లి శ్రీకాంత్ అన్నారు. అమరావతి రోడ్డులోని పవన్ ఏతెర్ షోరూంలో సోమవారం స్కూటర్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. కంపెనీ ఏరియా సేల్స్ మేనేజర్ పునీత్‌కుమార్ మొదటి వాహన తాళాన్ని కొనుగోలుదారుకు అందించారు. ఈ సందర్భంగా ఎండీ చుక్కపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ రిస్తా స్కూటర్ ప్రారంభం ధర రూ.1,09,841 అని, మార్కెట్‌లోని స్కూటర్ల కంటే 900 ఎం.ఎం. పొడవు సీటు ఉంటుందని తెలిపారు. వాహనం 160 కి.మీ. సర్టిఫైడ్ రేంజ్ దూరం ప్రయాణిస్తుందని వివరించారు. బ్యాటరీ 3.7 కిలోవాట్ కెపాసిటీతో వాటర్, డస్ట్‌ప్రూఫ్, ఫ్రంట్ డిస్క్ బ్రేక్, ఎల్‌ఈడీ పొషిషన్ ల్యాంప్, రివర్స్ మోడ్, సీట్ కింద 34 లీటర్ల స్టోరేజీ కెపాసిటీ, మూడేళ్ల బ్యాటరీ వారంటీ ఉందని పేర్కొన్నారు. ఏడు రంగుల్లో లభిస్తుందని, ముందస్తు బుకింగ్‌తో కొనుగోలుదారులు త్వరగా డెలివరీ పొందవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో షోరూం మేనేజర్ అనూష, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కంతేరు సర్పంచి మహేష్ మృతి





ఎయిమ్స్‌లో మహేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు తదితరులు



మహేష్ (ఫైల్)

మంగళగిరి: మండలంలోని ఆత్మకూరు వద్ద సోమవారం ఉదయం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తాడికొండ మండలం కంతేరు సర్పంచి బెజ్జం మహేష్(45) మృతి చెందారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మహేష్ భార్యాపిల్లలతో కలసి హనుమాన్ జంక్షన్‌కు కారులో బయల్దేరారు. భార్య అక్కడ సచివాలయ ఉద్యోగిగా పని చేస్తోంది. మహేష్ నడుపుతున్న కారు అదుపు తప్పి ఎదురుగా వెళుతున్న లారీని ఢీకొట్టి, బోల్తా పడింది. మహేష్ అక్కడికక్కడే మృతి చెందగా భార్యాపిల్లలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ఎయిమ్స్ ఆస్పత్రికి వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీలో పూర్తి అంకిత భావంతో పనిచేసిన మహేష్ ప్రజల సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో వ్యవహరించారని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పేరేచర్ల మస్తానవలి, తాడికొండ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు ఉన్నారు.

ఈతకు వెళ్లి గల్లంతైన విద్యార్థి మృతి



దుర్గా ప్రవీణ్ (ఫైల్)

సత్తెనపల్లి: స్నేహితులతో కలసి సరదాగా ఈతకు వెళ్లిన యువకుడు గల్లంతై మృతి చెందిన సంఘటన సత్తెనపల్లిలో సోమవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని 6వ వార్డుకు చెందిన తాపీ పనులు చేసే గుంజి రాంబాబు, తిరుపతమ్మ దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు గుంజి దుర్గాప్రవీణ్ (10) పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో 4వ తరగతి విద్యనభ్యసిస్తున్నాడు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో మరో ముగ్గురు స్నేహితులతో కలసి ఈత కొట్టేందుకు పట్టణంలోని తారకరామాసాగర్‌కు వెళ్లారు. నలుగురు ఈతకొట్టేందుకు తారకరామాసాగర్ చెరువులోకి దిగగా ముగ్గురు మాత్రమే బయటికి వచ్చారు. దుర్గాప్రవీణ్ ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో ముగ్గురు స్నేహితులు తిరిగి తమ ఇళ్లకు వెళ్లిపోయారు. కుమారుడు ఇంటికి రాకపోవడంతో గుంజి రాంబాబు పలుచోట్ల ఆరా తీశాడు. అయినప్పటికీ ఎక్కడా సమాచారం లభించలేదు. తమ కుమారుడు దుర్గాప్రవీణ్ వెంట వెళ్లిన స్నేహితుల ఇళ్ల వద్దకు వెళ్లి సోమవారం ఉదయం ఆరా తీయగా .. నలుగురం కలసి ఈత కొట్టేందుకు తారకరామసాగర్ చెరువులో దిగామని దుర్గాప్రవీణ్ ఒడ్డుకు రాకపోవడంతో కొద్దిసేపు చూసి తిరిగి వచ్చేశామని స్నేహితులు తెలిపారు. దీనిపై గుంజి రాంబాబు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పట్టణ సీఐ పోలూరి శ్రీనివాసరావు, పోలీసులు, మృతుడి తండ్రి గుంజి రాంబాబు తారక రామాసాగర్ వద్దకు చేరుకున్నారు. చెరువులో వెతుకులాట ప్రారంభించగా దుర్గా ప్రవీణ్ మృతదేహం లభించింది. దుర్గా ప్రవీణ్ మృతదేహానికి పట్టణంలోని ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు అందించారు. పట్టణ ఎస్‌ఐ ఎం సంధ్యారాణి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న కుమారుడు ఇక లేడన్న వార్త తెలియడంతో మృతుడి తల్లిదండ్రులు తిరుపతమ్మ, రాంబాబు, సోదరి, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. వారి రోదన చూపరులను కంటతడి పెట్టించింది.

శేష జీవితం ఆనందంగా గడవాలి



జిల్లా ఎస్పీ మలికా గార్గ్‌తో ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులు

నరసరావుపేట: పోలీసు విభాగం ద్వారా నిత్యం ప్రజాసేవ చేసి ఉద్యోగ విరమణ పొందిన వారందరూ శేష జీవితం కుటుంబ సభ్యుల మధ్య సుఖ సంతోషాలతో గడవాలని జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆకాంక్షించారు. జిల్లా పరిధిలో సుదీర్ఘకాలం ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి గత నెల 30న ఉద్యోగ విరమణ చేసిన ఏడుగురు పోలీసు అధికారుల వీడ్కోలు సమావేశం జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ మలికా గార్గ్ పాల్గొని ప్రతి ఒక్కరిని పేరుపేరున అభినందిస్తూ సత్కరించి ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఉద్యోగ విరమణ పొంది సన్మానం పొందిన వారిలో డీసీఆర్‌బీ ఎస్‌ఐ సీహెచ్.వీరాంజనేయులు, సత్తెనపల్లి పట్టణ పోలీసుస్టేషన్ ఏఎస్‌ఐ ఎం.రామ్మోహనరావు, ఐనవోలు పోలీసుస్టేషన్ ఏఎస్‌ఐ ఎం.చెంచయ్య, ఏఆర్ ఎస్‌ఐ వై.భాస్కరరావు, హెడ్‌కానిస్టేబుల్ ఎం.వెంకటేశ్వరరావు ఉన్నారు.

సీఎం చంద్రబాబుతో రైల్వే జీఎం అరుణకుమార్ జైన్ భేటీ

- రాష్ట్రంలో పలు అభివృద్ధి పనులపై చర్చ
- గుంటూరు డివిజన్ అధికారులతో సమీక్ష



సీఎం చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దక్షిణ మధ్య రైల్వే జీఎం జైన్

లక్ష్మీపురం: వెలగపూడిలోని సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సోమవారం భేటీ అయ్యారు. రాష్ట్రంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, ప్రాజెక్టుల గురించి చర్చించారు. ముఖ్యమంత్రితో పాటు గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం.రామకృష్ణ, విజయవాడ డివిజన్ డీఆర్‌ఎం నరేంద్ర, ఎ.పాటిల్ ఉన్నారు. అక్కడ నుంచి గుంటూరు డివిజనల్ మేనేజర్ కార్యాలయానికి విచ్చేయడంతో డివిజన్ అధికారులు, డీఆర్‌ఎం, ఏడీఆర్‌ఎం తదితరులు ఘన స్వాగతం పలికారు. డివిజన్ కార్యాలయంలో డివిజన్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జీఎం అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ రైల్వే భద్రత ప్రాముఖ్యతను వివరించారు. ప్రధానంగా రైల్వే శాఖకు లోకో పైలట్లు ఫ్రంట్ లైన్ సిబ్బంది పాత్ర చాలా ముఖ్యమైనదని వివరించారు. చాలా పెద్ద బాధ్యత వహిస్తారని చెప్పారు. నిబంధనల ప్రాముఖ్యతను కూడా జీఎం పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ డివిజన్ అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. పలు అభివృద్ధి ప్రాజెక్టులను వేగవంతం చేయాల్సిందిగా ఆదేశించారు. ఆదాయాన్ని మరింత పెంచడానికి తీసుకోవాల్సిన నూతన ఆధునిక పద్ధతిలో ఆలోచన చేయాల్సిందిగా కోరారు. రికార్డు స్థాయిలో దక్షిణ మధ్య రైల్వే ఉండాలని ఆకాంక్షించారు. సమావేశంలో డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ, డివిజన్ ఏడీఆర్‌ఎం సైమన్స్ పాల్గొన్నారు.

విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలి

బాపట్ల డీఈఓ వెంకటేశ్వర్లు



బోధనపై టీచర్లతో చర్చిస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

కుంకలమర్రు(కారంచేడు): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మక విద్యనందించడంలో ఉపాధ్యాయులు కీలకమని బాపట్ల జిల్లా డీఈఓ జి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని కుంకలమర్రు ఉన్నత పాఠశాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందించే స్టూడెంట్ కిట్ల పంపిణీ జరిగిన విధానాన్ని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు, మౌలిక వసతుల కల్పనపైన ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. శుద్ధమైన తాగునీటిని అందించాలన్నారు. గతంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్ మరమ్మతులకు గురవ్వడంతో త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే తరగతుల నిర్వహణలోను ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్(ఐఎఫ్‌పీ) ద్వారా సులభతర బోధనలు చేయాలని కోరారు. ఈ ప్యానల్స్‌ను అన్ని తరగతి గదుల్లో సక్రమంగా వినియోగించాలని చెప్పారు. ఈ ఏడాది అకడమిక్ క్యాలెండర్ ప్రకారం తరగతులు, పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. విద్యా, బోధనల్లో నిర్లక్ష్యంగా ఉండవద్దని కోరారు. ఉత్తీర్ణత శాతం విషయంలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఈఓ ఎం.నిర్మల, కారంచేడు ఎంఈఓ–2 ఎం.వెంకటేశ్వర్లు, ఏఎస్‌ఓ సంజయ్, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎం.ప్రభూజీ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

మనవడు భీమ్‌రావ్ యశ్వంతరావ్



సభలో మాట్లాడుతున్న భీమ్‌రావ్ యశ్వంతరావ్

పాత బొమ్మువానిపాలెం(కొల్లిపర): అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరిస్తూ వాటిని ముందుకు తీసుకెళ్లాలని ఆయన మనవడు, గ్లోబల్ రిపబ్లికన్ పార్టీ జాతీయ అధ్యక్షుడు భీమ్‌రావ్ యశ్వంతరావ్ అంబేడ్కర్ పిలుపునిచ్చారు. మండలంలోని పాత బొమ్మువానిపాలెంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం రాత్రి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ దళితులు, ఆదివాసీలకు మాత్రమే నాయకుడు కాదని, దేశంలోని ప్రతి పౌరుడికీ, హక్కులు కావాలనే ప్రతి ఒక్కరికీ నాయకుడేనని తెలిపారు. పాత బొమ్మువానిపాలెంలో విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విగ్రహ ఆవిష్కరణకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ నేటి యువత డీజేలు, ఇతర వాటికి బానిసలుగా మారారని విమర్శించారు. నిజమైన అంబేడ్కర్ అభిమానులు డీజేలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. తొలుత యువత, అంబేడ్కర్ అభిమానులు ముఖ్య అతిథుల్ని దావులూరు అడ్డరోడ్డు నుంచి విగ్రహావిష్కరణ సభా ప్రాంగణం వరకు జై భీమ్ నిదానాలతో, బైకు ర్యాలీతో తీసుకువచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు, అంబేడ్కర్ అభిమానులు, యువత పాల్గొన్నారు.

డ్రైవర్స్ కాలనీ యూపీహెచ్‌పీకి జాతీయ స్థాయి అవార్డు

- ఢిల్లీలో అవార్డు అందుకున్న స్టేట్ నోడల్ వైద్యులు
- హర్షం వ్యక్తం చేసిన వైద్యులు



ఇటీవల ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న వైద్యులు విజయలక్ష్మి, రమాదేవి, మానస

తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో ప్రకాష్ నగర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నగర్(డ్రైవర్స్ కాలనీ) లోని యూపీహెచ్‌సీ జాతీయ స్థాయి అవార్డు లభించింది. ఢిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో అవార్డును ఆంధ్రప్రదేశ్ నుంచి స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ జె.విజయలక్ష్మి, స్టేట్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రమాదేవి, యూపీహెచ్‌సీ డాక్టర్ మానస ఈ అవార్డును అందుకున్నారు. అవార్డు అందుకుని యూపీహెచ్‌సీ విచ్చేసిన బృందానికి సోమవారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ మానస మాట్లాడుతూ రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఎన్‌హెచ్‌ఎం ఎండీ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ జె.విజయలక్ష్మి, స్టేట్ క్వాలిటీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రమాదేవి, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా యూపీహెచ్‌సీలకు నేషనల్ క్వాలిటీ స్టాండర్డ్స్ తీసుకురావడానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. మన ఆసుపత్రిలోని 12 విభాగాల కృషి వలన ఇలాంటి అరుదైన అవార్డు దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. గత సంవత్సరం కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా యూపీహెచ్‌సీల పనివిధానాన్ని పరిశీలించారని అప్పట్లో మన యూపీహెచ్‌సీని కూడా తనిఖీ చేయడంతో మనం చేస్తున్న సేవలను గుర్తించి 97.2 మార్కులు కేటాయించి జాతీయ హామీ ప్రమాణాల గుర్తింపు సర్టిఫికేషన్ ఇచ్చిందని, దానిలో భాగంగా ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం మనకు అందించిందని ఈ అవార్డు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి, డీపీఎంఓ డాక్టర్ రత్న మన్మోహన్, క్వాలిటీ కన్సల్టెంట్ వాసుదేవరాజు, స్టేట్ క్వాలిటీ కన్సల్టెంట్స్, సిబ్బంది కష్టపడి సమష్టిగా పనిచేయడం వల్ల ఈ అవార్డు మనకు దక్కిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పేద ప్రజలకు వైద్య సేవలు అదించేందుకు విశాలమైన భవనాలు నిర్మించి, అందులో అనారోగ్యం పాలైన వారికి వైద్య సేవలు అందించేందుకు, ఓ.పి., అనుభవజ్ఞులైన డాక్టర్లు, 66 రకాల వైద్య పరీక్షలు, 172 రకాల మందులు అందిస్తోందని వివరించారు.

చదువు, అభివృద్ధి సంతోషంగా జరగాల్సిన ప్రక్రియ

- విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య
- బీటెక్ ఫస్టియర్ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న లావు రత్తయ్య

చేబ్రోలు: విద్యార్థుల్లో చదువు, అభివృద్ధి అనేవి సంతోషంగా జరగాల్సిన ప్రక్రియని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో సోమవారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతుల ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడారు. విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రత్యేకంగా అమలు చేస్తున్న పంచ సూత్రాల (1.ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, 2.ప్లానింగ్, ట్రెనింగ్, కమ్యూనికేషన్ సిస్టమ్, 3.కౌన్సెలింగ్ సిస్టమ్, 4.సీఆర్‌టీ తరగతులు, 5.బోధన పద్ధతి) వల్లే తమ దగ్గర చదివిన విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాల్ని అధిరోహిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులంతా పిల్లల్ని బాగా ప్రోత్సహిస్తే ఆరోగ్యంగా, మానసికంగా, సర్వతోముఖంగా అభివృద్ధి చెందుతారని సూచించారు. విద్యార్థులందరూ చదువులో మాత్రమే కాకుండా సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటేనే మంచి ప్రొఫైల్ డెవలప్ అవుతుందన్నారు. కమ్యూనికేషన్, టీమ్ స్పిరిట్ పెంచడానికి యూనివర్సిటీలో ఎప్పుడూ ఈవెంట్స్‌ను నిర్వహిస్తామని తెలియజేశారు. విద్యార్థుల్ని ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ వారిలో దాగున్న నైపుణ్యాల్ని వెలికితీసి, అభ్యున్నతికి, పరిపూర్ణ వ్యక్తిత్వ నిర్మాణానికి తోడ్పడుతామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ రఘునాథన్ పాల్గొన్నారు.